

# కన్నీటి గంగ

–డి.నాగమణి

గూట్లో చిమ్నీలేని దీపం గాలికి రెపరెపలాడుతోంది.. దాని ఆయుష్షు మరికొద్ది సేపే. దాన్లో కిరసనాయిలు అయిపోవచ్చింది మినుకు మినుకు మంటున్న ఆ వెలుగుకూడా ఎంతోసేపో వుండదు ఆ తరువాత అంతా చీకటి. తన జీవితం లాగా.

పక్కనున్న చంటిది అప్పటిదాకా పోరుపెట్టి ఇక ఓపికలేనట్లు సొమ్మసిల్లి పడి వుంది. అన్ని సమస్యల కంటే ముందు దీనిసమస్య ఎలాగో అర్థంకావటంలా, వుండుండి, తనదగ్గర పాల కోసం తెగ తడుముకుం టుంది అయినా తనలో తడి ఎక్కడిది? అన్నం తిని నాల్గురోజులయింది ఏడ్చి ఏడ్చి శరీరంలో నీరు ఇంకి పోయింది. ఆ వున్న ఒక చుక్కపాలు ఎపుడో ఎండిపోయాయి.

రాములు ఇంకా రాలేదు ఎక్కడ తాగిపడు న్నాడో ఏమో? ఆడొచ్చేదాకా ఈ దీపముంటే బాగుండు. గుడిశలో దీపం లేకపోతే మరింత చిరాకు పడతాడు. పెట్టటానికి అన్నమెలాగూ లేదు, తను పని చేసేచోట అంతో ఇంతో మిగిలిన కూడుపెడుతుంటే అది తెచ్చి వాడికి పెట్టేది. ఇవాళ వాళ్ళుకూడా లేరు. నాల్గురోజులదాకా రారంట. పండక్కి ఊరెళ్ళారు. వాళ్ళిచ్చే అరకప్పుటీ నీళ్ళు చంటిదాని నోట్లో పోసేది. ఇయాళ ఆ నీళ్ళూలేవు.

"టప్... టప్" ఉలిక్కిపడింది పైకప్పులోంచి రెండు చినుకులు పడి గంగ శరీరం సూదుల్తో పొడిచినట్లు చివ్వుమంది. చంటిదాని మీద కూడా పడ్డాయేమోనని దగ్గరకు తీసుకుంది. ఇంకా లేదనుకుంటూ పడుకునే వుంది. ఇప్పుడెలా కప్ప టానికి కూడా ఏమీ లేదు. లేచి మూల నున్న గోనెసంచి తెచ్చి చంటిదానికి కప్పింది. ఇక తనూ పడుకోలేదు ముడిచిపెట్టుకు కూర్చుంది.

గూట్లో దీపం కొడిగట్టి ఆరిపోవటానికి సిద్ధంగా వుంది. కవురుకంపుకొడుతుంది. రాములు రాలేదు ఇంకా. చీకట్లో చంటిది జడుసు కుంటుందో ఏమో నెమ్మదిగా లేచి ఒళ్ళోవేసుకుంది మళ్ళీ మొదలు, పాలకోసం తడుముకుంటోంది నీరసంగా మూలుగుతూ. చీకిపోయిన ఒంటిమీద ఒక్క రవికా చంటిదాని గోరు తగిలి రొమ్ము మీద సర్రుమని చిరిగింది. అయిపోయింది ఇక తెల్లా రాక బయటకు వెళ్లే దారికూడా లేదు. ఇప్పటి వరకు ఎక్కడ దాక్కున్నాయో? చివ్వున కళ్ళనిండా నీళ్ళు నిండుకున్నాయి.

తెల్లారింది. రాముడింకా రాలేదు. చంటిది ఒకటేపోరు ఆకలికి తట్టుకోలేక మెలికలు తిరిగి పోతోంది. తనకి ఇరుగుపొరుగు అప్పిచ్చేవాళ్ళు ఎవరూలేరు. అందినంత వరకూ అప్పుచేసి పిల్లను కాపాడుకుంటూ వచ్చింది. ఇప్పుడు ఎటూ దారిలేదు చచ్చిపోవాలని వుంది. కాని అదీ చేత కావటంలేదు. ఈ చంటిదాని గతేంటి? దాన్ని బుజానవేసుకుని, చినిగిన చీరనే బుజంనిండా కప్పుకొని గుడిశ బైటకు నడిచింది. ఎటుపోవాలి? ఏం చేయాలి? అడుగుతీసి అడుగుపడటంలా అయినా అలా ముందుకు నడిచింది. వీధిచివర చింత చెట్టు కనిపించింది. తనను, రాముల్ని కలిపిన ఆ చింతచెట్టు ఇప్పుడు వికృతంగా ఎదురుగా నిలబడి వుంది.

ఆ చింతచెట్టు నీడన తనూ రాములు ఎన్ని ఊసులాడుకునేవారు? ఆ చెట్టు చాటున ఎన్ని ముద్దులెట్టుకునేవారు?? ఆ చెట్టుదాపున ఒకరి కోసం ఒకరు ఎన్నిసార్లు ఎదురు తెన్నులు చూసే వారు?

గత జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటుంటే వెనక నించి పిలుపు. గంగా ఇంత పొద్దున్నే బయట కొచ్చేవేం? పిల్లకు ఒంట్లో బాగులేదా?

వెనక్కి తిరిగి చూసింది గంగ, 'ఆ బాగానే వుంది' పిల్లను బుజానికి మార్చుకుంటూ చెప్పింది గంగ. ఆ కదలికలో గంగకు తెలియకుండానే పైట కొంగు తొలగి చిరిగిన రవిక మాటు శరీరం బయటపడింది. ఆ దృశ్యం చంద్రం కంటపడింది. పరిస్థితి అర్థమయింది. బుజాన తగిలించిన సంచీ కిందికి దించాడు 'కూచో గంగా' అంటూ అందులోంచి ఏదో తినే పొట్లాలు బయ టకుతీసాడు. గంగ మనసు చివుక్కుమంది. తనిక్కడికి వచ్చినపుడల్లా చంద్రం వూరికే పంపడు ఏదోకటి పెట్టి డబ్బులిచ్చి పంపు తాడు. గత్యంతరంలేని తను మాట్లాడకుండా అవి తీసుకోవటం తప్ప ఏమీ చేయలేక పోతోంది. ఇబ్బంది కలిగినపుడల్లా తన కాళ్ళు ఇక్కడికి రప్పి స్తున్నాయి.ఎంత అభిమాన వతి అయినా చేసేది ఏమీ లేదు. అయినా అంటూ వుంటుంది. 'ఇవన్నీ నాకెం దుకు చంద్రం? ఇప్పుడేం వద్దులే' అని. "చూడు గంగా నాకు మాత్రం ఎవరున్నారు. తల్లా, తోబుట్టువా? పెళ్ళాం పిల్లలా? ఎవరికోసం దాచి ఇంటికి తీసుకెళ్ళాలి? నాకిష్టమైన నీకిస్తే తప్పే ముంది తీసుకో" అంటూ ఆ పొట్లాలు అందిం చాడు. గంగ మొహమాటంగా అందుకుంది.

"వుండు నీళ్ళట్టుకొని ఇప్పుడేవస్తా" అంటూ సందు మలుపు తిరిగి గబగబా ముందుకు వెళ్ళాడు. కాసేపటికి ఒక చేతిలో పాల గ్లాసు ఒక చేతిలో మంచినీళ్ళు చెంబుతో తిరిగొచ్చాడు.

"ఇదిగో ఈ పాలు పిల్లదానికి పట్టించు" అని గంగ చేతికందించాడు. ఈసారి ఏం మాట్లాడ కుండా అవన్నీ తీసుకుంది గంగ.

"రాములు లేడా గంగా?"

"లేడు మొన్ననగా ఎల్లాడు. ఇంతవరకూ రాలేదు. ఏడకి పోయాడో ఏమో?" దిగులుగా ముఖంపెట్టి పాలని పిల్లకు పట్టించ సాగింది.

"గంగా... ఇంకా ఎన్నాళ్ళు ఇలా ఆ తాగుబోతు వాడితో తంటాలు పడతావు? నిన్న అత్తిలి తీర్థంలో ఎవరితోనో తిరుగుతున్నాడంట... నువ్విక్కడ రోజు రోజూ ఆడికోసం బెంగట్టుకు చస్తన్నావు. ఆడు మారతాడనీ నీకు ఇంకా నమ్మకం వుందా? ఇలా ఎన్నాళ్ళు పిల్లదానితో అవస్తపడతావు? నువ్వు ఎన్నాళ్ళని తిండిలేకుండా మాడతావు? నా మాటినుగంగా. నాతో వచ్చేయి. ఇద్దరం కలిసి బతకలేకపోము. కూలిపని చేసుకుని హాయిగా బతకొచ్చు. మనిద్దరం కష్టపడి తెచ్చే ఆ రూపాయలతో మనం తిని ఈ పిల్లను చక్కగా పెంచి పెద్ద చేయొచ్చు. చదువు సంధ్యలు చెప్పించొచ్చు ఏదో అవకాశం దొరికింది కదా

ఈడిలా మాటాడుతున్నాడని అనుకోకు గంగా... ఇలా ఎన్నాళ్ళు బాధలు పడతావు? ఆడు ఎప్పుడు వస్తాడో తెలియదు వచ్చినా నిన్నెంత వరకు సుఖపెడతాడో తెలియదు. ఒంటరి బతుకు ఎన్నాళ్ళని ఈడ్చుకొస్తావు? ఇలా నేను అవి ఇవీ ఇచ్చి నీతో యిలా మాట్లాడతావుంటే ఈ లోకం ఎన్నాళ్ళని వూరుకుంటుంది? అలా అని నిన్ను వదిలేసి నేనూరుకోలేనుగా, ఆలోచించు గంగా?'' తలొంచుకుని చేతికర్రతో నేలమీద గీతలు గీస్తూ చెప్పుకుపోసాగాడు. ఎంత చేసినా ఇంటికాడ ఎవరూలేరని అదీయిదీ తిండానికి ఇస్తున్నాడు. కాని చీరా రవికా ఏ వంకతో యివ్వాలి? సగం చిరిగిన ఈ చీరా రెవికా ఇంకా ఎన్నాళ్ళు ఆ శరీరాన్ని దాస్తాయి? చంద్రం మనసులో బాధ అది. గంగ మౌనంగా లేచి 'వెళ్ళొస్తా చంద్రం' అంటూ తన గుడిసెకేసి వెళ్ళిపోయింది.

"ఈ చంద్రానికి ఎందుకు తన మీద అంత ప్రేమ? తను అతన్ని ఎన్ని తిట్లు తిట్టింది? ఎంత హేళనగా మాట్లాడింది? అవి రాముల్ని పెళ్ళి చేసుకునే ముందు రోజులు చిన్నప్పట్నించీ తెలుసున్న చంద్రం అంటే గంగకి ఒక ఆట. గోచిపోసి కట్టిన చీరకట్టు. వంటికి బిగుతుగా వున్న జాకెట్టు తుమ్మెద రెక్కల్లాంటి కురుల్ని ముచ్చటగా ముడి వేసి సిగనిండుగా బంతిపూలను పెట్టి కాళ్ళకి జోడు కడియాలు అందంగా మెరుస్తుంటే... గంగ ఒక జానపద నాయకిలా నండూరి ఎంకిలా ఎప్పుడూ కొంటెగా మాట్లాడి చంద్రాన్ని ఏడిపిస్తూ వుండేది. రాముల్తో జోడి కుదిరాక మరీ బడాయికి పోయేది. ఒకరోజు చంద్రం అన్నాడు, "గంగా రాముల్తో నీకు దోస్తీ ఎక్కువయింది. ఆడు ఎటు వంటోడో నీకు తెలియదు. నామాటిని ఆడితో స్నేహం మానుకో. నన్ను పెళ్ళిచేసుకో గంగా నిన్ను పువ్వుల్లోపెట్టి చూసుకుంటాన"నగానే గంగకి ఎక్కడలేని కోపం వచ్చింది. జీరాడే పావడాని ఎగకట్టి పైట నడుముకి చుట్టి ముందుకు వచ్చింది.

"ఏంటీ రావులు మంచోడు కాడా నువ్వు మహామంచోడివా? రావులు దొరబాబులా వుంటాడని నీకు కుళ్ళు, ఆణ్ణి పెళ్ళిచేసుకుంటున్నానని నీకు అసూయ. నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలా? ఎప్పుడైనా నీ మొఖం అద్దంలో చూసుకున్నావా? చూసుకునుండవు. పగలు చూస్తే రాత్రి కల్లోకొచ్చే గొప్ప అందం నీది. గుడిసె ముక్కు, అడుసుకళ్ళు, దొప్ప చెవులు, దాకనోరు, చింపిరి జుట్టు సొట్టకాలు. ఆహా నీ అందమే అందం ఇదిగో చంద్రం ఇప్పుడే చెపుతున్నా పెళ్ళి వూసు మరెప్పుడైనా ఎత్తావా మరియాదగా వుండదు. నేనేకాదు ఈ హెూలు ఇండియాలోనే నిన్ను పెళ్ళాడే దద్దమ్మ ఎవరూ వుండరు. ఓ ఏళ ఎవుత్తయినా నిన్ను పెళ్ళి చేసుకుందనుకో ఇదిగో ఈ జోడు కడియాలు నీ పెళ్ళికి కానుకగా చదివిస్తా తెలిసిందా. ఒక నెల్లో రావుల్ని పెళ్ళాడి కాపురం పెట్టకపోతే చూడు నాపేరు గంగమ్మేకాదు. ఇంకెప్పుడు నా రావుల్ని చూసి కళ్ళలో నిప్పులు పోసుకోకు'' అంటూ కోపంగా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

అన్నట్లే నెల్లాళ్ళలో రాముల్ని పెళ్ళాడి ఆ చంద్రం వీధిలోనే ఒక గుడిశలో కాపురం పెట్టింది. లారీ క్లీనర్‌గా పనిచేసే చంద్రం పాంటు షర్టువేసి నోట్లో సిగరెట్టుతో ఎప్పుడు దువ్విన జుట్టుతో బాగానే వుండేవాడు. గంగ కాపురం మూడు నెలలు ముణ్ణాళ్ళ ముచ్చటగా సాగింది ఇక అక్కణ్ణించి ప్రారంభం అయ్యాయి కష్టాలు. పని చేసి తెచ్చిన డబ్బులు సరిగా యిచ్చేవాడు కాడు తాగి వచ్చి గంగను చచ్చేలా బాదేవాడు. ఈ మాయదారి తాగుడు మానమని గంగ ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోలేదు. రాను రాను ఆ తాగుడు మరీ ఎక్కువయింది. ఒకరోజు తాగి లారీ తోలుతూ చిన్న ఏక్సిడెంటు చేసాడని లారీ ఓనరు పనిలోంచి తీసేసాడు. అప్పటి నుండి దొరికిన రోజు పని, లేకపోతే గుడిశలో తాగిపడుకోవటం. పూట గడవని పరిస్థితిలో తన దగ్గర వున్న ఒక్క ఆస్తి జోడు కడియాలు తీసి అమ్మింది. అవి మాత్రం ఎన్నాళ్ళు వస్తాయని? ఈ లోగా పిల్ల పుట్టింది. ఉద్యోగం వెతుక్కోవాలంటూ బయట కెళ్ళే రాములు గుర్తొచ్చినపుడు గుడిసె కొచ్చేవాడు. పిల్లపాట్టకు కూడా జరుగుబాటు లేక గంగ ఒకరింట్లో పనిమనిషిగా చేరి పొట్ట సగం నింపుకుంటోంది. వచ్చినపుడు కూడెట్టకపోతే అదీ రాడేమోనని ఆ తెచ్చుకున్న కూడు కూడా రాములుకే దాచిపెట్టేది. గంగ కళ్ళనించి నీళ్ళు ధారగా కారిపోతున్నాయి. చేయి ముందుకు జరిపి పాదాలపైన తడిమి చూసుకుంది. బోసిగా వున్న పాదాలు తగిలాయి. తనకా జోడు కడియాలంటే ఎంతిష్టం.

జ్ఞాపకాల మాటు నుంచి బయట కొచ్చింది గంగ. ఏం చేయాలి తను? చంద్రం చెప్పిందంతా నిజమే. ఇక రాములు మీద నమ్మకం లేదు. తాగుడికి అలవాటు పడిన రాములు ఇక తనని, ఒక్కగానొక్క కూతుర్ని సరిగా చూస్తాడన్న నమ్మకం అసలు లేదు? ఏం చేయాలి? ఏం చేయాలి??... ఒంటి మీద ఒక గుడ్డా చిరిగిపోయింది. ఇక రేపట్నుంచి ఎలా? ఒకటే ఆలోచన. తెల్లవార్లూ కంటి మీద కునుకులేదు. మనసంతా దిగులుగా వుంది. తెల్లవారుతోందన్నట్లు కోడి కూసింది. మళ్ళీ తెల్లారింది. తన పాట్లు మళ్ళీ మొదలు. ఎక్కడి కెళ్ళాలి? వెలుగు రేఖలు భూమిమీద పరుచుకుంటున్నాయి. చంటిదాన్ని భుజాన వేసుకుని మళ్ళీ చింతచెట్టుకేసి భారంగా నడిచింది. అక్కడ ఎవరూ లేరు. చంటిదాన్ని వళ్ళో వేసుకుని అక్కడే చెట్టు మొదట్లో చతికిలబడింది. గంట గడిచింది. చంద్రం కోసం గంగ చూపులు ఎదురుచూస్తున్నాయి. అల్లంత దూరాన చంద్రం కనిపించాడు. ఇటే వస్తున్నాడు.

అతని కళ్ళలో ఆశ్చర్యం. దగ్గరకొచ్చి అడిగాడు "ఏంటి గంగా ఇంత పొద్దున్నే వచ్చావు?''

"ఆ గుడిశ వదిలి వచ్చేసాను. ఇక నీతోనే కలసి వుంటాను చంద్రం" తలొంచుకుని చెప్పింది.

"నిజంగా... నిజంగా నాతో వచ్చేస్తావా? అయితే వుండు ఇప్పుడే వస్తా'' అంటూ ఆనందంతో గబగబా వెనక్కి వెళ్ళిపోయాడు. గంట వరకూ తిరిగిరాలేదు. గంగ ఆత్రంగా చంద్రంకోసం ఎదురు చూస్తోంది. చేతిలో రెండు సంచుల్తో తిరిగి వచ్చాడు చంద్రం. ముందుగా తినటానికి అందు లోంచి పొట్లాలు తీసి యిచ్చాడు. టీ, పాలు, మంచి నీళ్ళు యిచ్చాడు. పిల్లకు పాలు పట్టించి తెచ్చినవి గంగ తింది. అంతవరకూ గంగనే చూస్తూ కూచున్నాడు చంద్రం, నెమ్మదిగా సంచీలోంచి చీరా రవికా తీసి గంగకిచ్చాడు. 'ఇన్నాళ్ళు ఏ బంధం పెట్టుకుని యివి నీకు యివ్వాలో తెలీలేదు. ఇప్పుడు ఆ దేముడి గుళ్ళో నిన్ను పెళ్ళి చేసుకుని నీకు పెనిమిటి కాబోతున్నాను కదా! అందుకనే ఇవి తెచ్చాను. తీసుకెళ్ళి ఆ గుడిమాటున ఇవి కట్టుకో'' అంటూ అందించాడు.

మౌనంగా చీరా రవిక తీసుకుని గుడిమాటు కెళ్ళింది గంగ. చంటిదాన్ని ఎత్తుకుని ఆడిస్తున్నాడు చంద్రం, చీరకట్టుకుని బయటకు వచ్చిన గంగ చంద్రం చేతిలో చంటిదాన్ని చూసి, మనసు కరిగిపోయింది. కడుపున పుట్టిన పిల్లయినా రాములు ఎప్పుడైనా ఎత్తుకున్నాడా?

చంద్రం చంటిదాన్ని గంగకు అందించి సంచీలోంచి మరో పొట్లం బయటకు తీసాడు. అందులో వున్నాయి ఒక పసుపుతాడుకు కట్టిన పసుపుకొమ్ము, జోడు కడియాలు. "గంగా నా పెళ్ళిరోజు నా పెళ్ళానికి నీ కడియాలు యిస్తానన్నావుగా ఇవిగో నీ కడియాలు ఏం చేసుకుంటావో చేసుకో'' అంటూ కాలికి తొడిగాడు. కళ్ళనిండా వచ్చిన కన్నీళ్ళు "టప్ టప్"మని చంద్రం చేతి మీద రాలాయి. తలెత్తి చూసి జారే కన్నీటిని తుడుస్తూ, ఎంతో ఆత్మీయంగా గంగ కళ్ళలోకి చూస్తూ... "పిచ్చిదానా ఎందుకు నీకిక కన్నీళ్ళు? నీ కళ్ళలో ఇక ఎప్పుడూ దిగులు కనిపించకూడదు. చెప్పానుగా నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటానని. ఇంకా ఈ దిగులెందుకు'' అంటూ దగ్గరకు తీసుకుని నడిపించుకుంటూ గుడివైపు సాగిపోయాడు.

ఊళ్ళోకి బస్సువచ్చింది. అందరూ హడావిడిగా బస్సు లెక్కుతున్నారు. గంగతోపాటు చంద్రం కూడా ఎక్కాడు. కిటికి పక్కన సీటు దొరికింది. చంద్రం కూచున్నాడు. అతని ఒళ్ళో చిన్నారి చంటిది. చంద్రం బుజానికి తలఆన్చి భారమంతా చంద్రానిది అన్నట్లు నిశ్చింతగా కళ్ళుమూసుకుంది గంగ. ✻